'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

రాహుల్! చిలుక పలుకులు మానుకో..

కనకదుర్గ దంటు
89772 43484

ఉద్యమ సమయంలో ఒక సందర్భంలో తెలంగాణ సిద్ధాంతకర్త డాక్టర్ జయశంకర్ కాంగ్రెస్ నాయకుల గురించి ఒక మాట అన్నారు. '1969లో ఉద్యమం తర్వాత తెలంగాణ రాజకీయ నాయకులను చూసి భయపడ్డ ఆంధ్రా నాయకులు వారి పద్ధతి మార్చేశారు. ఎన్నికలలో టిక్కెట్లు కాంగ్రెస్, టీడీపీలలో తెలంగాణలో ఎందుకూ పని కిరానివాళ్లను ఏరి మరీ ఇచ్చారు. తమ ఆలోచనలు లేకుండా ఎస్ బాస్ అనే శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు తయారయ్యారు. అందుకే ఉద్యమం ఇంత తీవ్రంగా జరుగుతున్నా, తమకేమీ పట్టనట్టు తమ పార్టీ అధినాయకులకు అనుగుణంగా, ప్రజలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారు'.

ఈ మాటలు కాంగ్రెస్ నాయకులు గత 40 ఏండ్లుగా నిజం చేస్తున్నారు. ప్రజల ఆశలు పట్టించుకోకుండా, వారిని అణచివేసే పద్ధతులు చేయటమే కాకుండా, ఇతర విషయాల్లో కూడా తమ తెలివి తక్కువతనాన్ని ప్రదర్శించుకుంటున్నారు. నిన్న ములుగు సభలో ఇద్దరు ముఖ్య నాయకులు- ప్రియాంకా వాద్రా, రాహుల్ గాంధీ- మాట్లాడవలసి ఉన్నప్పుడు, ఇద్దరికీ విషయాల గురించి ఒకేలా రాసి ఇచ్చారు. సరే, ఉత్తర భారతదేశ నాయకులకు దక్షిణాన ఉన్న రాష్ట్రాల గురించి, ఇక్కడి రాజకీయ, సామాజిక విషయాల గురించి ఏమీ తెలియదు. తెలుసుకోవాలన్న ఉత్సాహం ఉండదు. ఈ రాష్ట్రాల నుంచి వచ్చే ఆదాయం, ఎన్నికలప్పుడు వీరి ఓట్లు మాత్రమే వారికి ముఖ్యం. అటువంటప్పుడు వారు ప్రసంగించాల్సి వచ్చినప్పుడు వారికి ఏ విషయాలు మాట్లాడాలో చెప్పే, లేక రాసేవారికి కొద్దిగా తెలివి తేటలు ఉండాలి. అట్లాకాకుండా ఇద్దరూ ఒక్కటే మాట్లాడారు నిన్న ములుగు సభలో. అది రాను రాను పేలవంగా అనిపించింది. ఇంక రాహుల్ గాంధీ- ముప్పై ఏండ్ల శిక్షణ తర్వాతైనా రాజకీయాల గురించి ఆ మాత్రం మాట్లాడగలిగారని సంతోషమేసింది.

ఇక ప్రసంగం! చెల్లెలు లాగే రామప్ప గుడిని పొగిడారు. అజ్ఞానానికి బాధేసినా మన దేవాలయం కాబట్టి ఆనందమేసింది. ఈ ఎన్నికలు దొరలకు, ప్రజలకు మధ్య జరుగుతున్నాయన్నారు. దేశంలో నెహ్రూ వారసుల కంటే దొరల లాగ బతుకుతున్న వాళ్లెవరైనా ఉన్నారా? ప్రియాంక అత్తగారి కుటుంబంతో సహా గన్‌మెన్లు ఉండగా ఇంకెవరు దొరలు? కాంగ్రెస్ పార్టీ దొరలు దేశం డబ్బు పోగేసుకుంటే, దొరల కుటుంబానికి చెందిన కేసీఆర్ రాష్ట్ర ఆదాయాన్ని పెంచి ప్రజలకు పంచుతున్నారు. కొనుగోలు శక్తి పెంచుతున్నారు. నగరాలలో హైదరాబాద్ ప్రజల ఆదాయం మిగతా నగరాలలో ఉన్నవారి కంటే ఎక్కువ ఉంటే, రాష్ట్రంలో మిగతా రాష్ట్రాల కంటే ప్రజల తలసరి ఆదాయం అధికంగా ఉంది. ఇదీ నిజమైన మానవీయ దొర సాధించిన విజయం!

'తెలంగాణ ఇస్తామన్న మాట నిలుపుకొని రాష్ట్రం ప్రసాదించాం' అన్నారు. మాట ఇచ్చిందెప్పుడు? రాష్ట్రం వచ్చిందెప్పుడు? 4 దశాబ్దాలు ఉద్యమం నడిచిన తర్వాత ఒక్కమాట నిలుపుకోవటానికి దశాబ్దకాలం కావాలా? ఆ పదేండ్లలో తెలంగాణ అన్నిరంగాల్లోనూ, నీళ్లు నిధులు, నియామకాల్లోనూ ప్రాణనష్టం జరిగి ఎంత నరకం అనుభవించిందో ఈ కాంగ్రెస్ దొరకు తెలుసా? అదీ ప్రజల ఆకాంక్షలు తీర్చటానికి రాష్ట్రం ఇవ్వలేదు. 2014 ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని ఇచ్చారన్నది అందరికీ తెలుసు. 2004 నుంచీ రాష్ట్ర విభజనకు అడ్డం పొడుగు అడ్డుగా ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పోయాక అయినా 2009లో మీరు రాష్ట్రం ఇచ్చినట్టయితే ప్రజలు మిమ్మల్ని ఆదరించి ఉండేవారేమో! 2004లో 6 వారాలలో ఇస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోయినా, కనీసం ఆరేండ్లకైనా ఇచ్చారని మంచి మనసున్న తెలంగాణ ప్రజలు మీ పక్షాన ఉండేవారేమో! కానీ మీరు ఆ అభిమానం నిలబెట్టుకోలేదు. కేవలం రాజకీయ అవసరం నెత్తిమీద పడ్డాకే ఇచ్చారని ప్రజలు అర్థం చేసుకొని, మిమ్మల్ని విసర్జించారు. అదీ మీ పార్టీ ఘోర పరాజయానికి కారణం. రాష్ట్రాన్ని మీరివ్వలేదు, త్యాగాలు, బలిదానాలు చేసి ప్రజలు సాధించుకున్నారు. చనిపోయిన పిల్లల కుటుంబాల బాధ, చీకటైనవారి ఇండ్లు ఇప్పటికీ ప్రజల మదిలో మెదులుతాయి.

రాష్ట్ర విభజన అయిన వెంటనే ఉద్యోగాల భర్తీ చెయ్యలేదన్నారు. కేంద్రం దానికి సహకరించిందా? కమిటీల మీద కమిటీలు వేసిన తెలంగాణ, ఆంధ్ర ఉద్యోగులను విభజించటానికి మనసొప్పలేదు మోదీకి. మరి ఉద్యోగాలెన్నో, ఎలా భర్తీ చేయాలో అప్పటిదాకా అధికారంలో ఉన్న తెలివైన కాంగ్రెస్ నాయకులూ సూచించలేదు! ఇదికాక ఆంధ్రలో అధికారం చేజిక్కించుకున్న చంద్రబాబు దాష్టీకాల వల్ల కరెంటు కష్టాలు, అది చూపించి టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టిన రాష్ట్ర కాంగ్రెస్ నేతలు, విభజించని హైకోర్టు... ఇలా అన్నిరకాల సమస్యలు ధీరుడిలా ఎదుర్కొని పరిష్కరించిన దొర, మా నాయకుడు, అమిత ప్రజ్ఞావంతుడు ఈ విషయాలన్నీ మీ శిష్యులు మీకు చెప్పకపోయినా, ప్రజలకు తెలుసు.

కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి అన్నారు. ఆ ప్రాజెక్టు కట్టడానికే 80 వేల కోట్లయితే, అదనంగా ఎక్కడినుంచి తెచ్చారు కేసీఆర్ తన అవినీతి కోసం? చెప్పేవాడికి తెలివి లేకపోతే, ప్రజల ముందు ప్రసంగించేవాడైనా నిజానిజాలు తెలుసుకొని మాట్లాడాలి కదా? మీ రాష్ట్ర పార్టీ నాయకులు ఏది చెప్తే అది వల్లిస్తే పోయేది మీ పరువే కదా!

ధరణి పోర్టల్‌తో ప్రజలు సంతోషంగా ఉన్నప్పుడు దాన్ని మీరు ఎత్తేస్తామంటే మీకు ఎన్ని ఓట్లు పడతాయో ఆలోచించుకోండి. మిమ్మల్ని, మీ పార్టీనే ఎత్తిపడేసే ప్రమాదం లేదా? ఇక డబుల్ బెడ్‌రూం ఇండ్లు. మీరు ఒక రాష్ట్రానికి వెళ్లినప్పుడు కనీసం ఆ రాష్ట్రంలో ఏం జరుగుతున్నదో మీ పార్టీ వాళ్లను కాకుండా జర్నలిస్టులను అడిగితెలుసుకోండి. ఇక్కడ చాలామందికి ఇండ్లే కాదు, ఇంటి స్థలాలున్న వాళ్లకు గృహలక్ష్మి పథకం కింద తలకు 3 లక్షల రూపాయల గ్రాంట్లు కూడా ఇచ్చారు. కర్ణాటకలో మీ పథకం గృహలక్ష్మి చీకటిలోకి వెళ్లింది, కానీ, ఇక్కడ ఇంకా అమలవుతోంది.

అయిదు గ్యారెంటీల గురించి మీ కాంగ్రెస్ ప్రభుత్వం కర్ణాటకలో మొదటి రోజే ప్రారంభించారన్నారు. నిజమే! యువనిధి తప్ప అన్నీ ప్రారంభించారు. ఒకటి, రెండోరోజు, ఇంకొకటి రెండో నెల, మిగతా రెండు ఈ నాలుగు నెలలోనూ ఆగిపోయాయి. మీ కాంగ్రెస్ పార్టీ కర్ణాటక నేతలు మీకు చెప్పలేదా? వాళ్లు కూడా మా రాష్ట్ర కాంగ్రెస్ నేతల్లాంటి వారేనా?

ట్రైబల్ బిల్లు, ఇంకెన్నో బిల్లులు తెచ్చాం అన్నారు. 60 ఏండ్ల పాలనలో ఒక దేశంలో ఎన్ని బిల్లులు పెట్టవచ్చు, ఎంత మార్పు తేవచ్చు? మన దేశ చరిత్ర కాకపోయినా, కనీసం మలేషియా, సింగపూర్ దేశాల గురించి, ఆ నాయకుల గురించి తెలుసుకోండి. 30 ఏండ్లలో పాశ్చాత్య దేశాలతో పోటీ పడేటట్టు చేశారు వారి దేశాలని. పైగా అక్కడ భారతదేశంలో లాగా సహజ వనరులూ లేవు! వెయ్యేండ్ల నుంచి నిర్వహించబడుతున్న మా సమ్మక్క, సారలమ్మ జాతర జాతీయ పండుగగా గుర్తింపు ఇస్తామన్నారు. 1956లో తెలంగాణలో కలిసిన ఆంధ్రా వారు, వారి రాజకీయ నాయకులు ఇక్కడి శాసనసభ్యుల బలవంతం మీద 22 ఏండ్ల తర్వాత 1978లో దయతో ఆ ప్రదేశానికి బస్సులు వేశారు. అది మీ కాంగ్రెస్ పార్టీ పాలనలోనే! మరి మాట ఇచ్చిన పదేండ్ల తర్వాత రాష్ట్రం ఇచ్చినవారు, ఈ గుర్తింపు ఎన్నేండ్ల తర్వాత ఇస్తారో! మోదీ గారి మహిళా బిల్లు లాగే ఉంది ఇది! అయినా మా దొర ఆ జాతరను స్పెషల్ గ్రాంట్ ఇచ్చి రాష్ట్ర పరిధిలో గుర్తించి, అంగరంగ వైభవంగా జరుపుతున్నారు. 2014 నుంచీ, మీ పథకాలు ప్రకటించినా అమలుకావు, అమలైనా త్వరగానే ఆగిపోతాయి. అంత శ్రమ పడకండి! బీఆర్ఎస్, బీజేపీ కలిసి ఉన్నాయన్నారు. అంత సీనే ఉంటే మాకు ప్రాజెక్టులు, వాటికి గుర్తింపు, ఏదైనా మొదలుపెట్టడానికి అనుమతులు అమాంతంగా రావడం, లక్షల కోట్ల డబ్బు గుజరాత్ లాగ కేంద్రం నుంచి రావటం జరిగేది. విద్యాలయాలు ఎన్నో వచ్చేవి కదా! అంతమాత్రం తెలుసుకోలేరా మీరు? ఎంఐఎం కలిసి ఉంది అన్నారు. ఆ విషయం ఆనందంగా ఒప్పుకుంటాం. ఎందుకంటే మా దొరకు మానవీయత తప్ప ఇంకే కొలమానమూ లేదు. మనుషులందరూ సమానం. మతం, జాతి, కులం లాంటి విభజనలు ఇక్కడ లేవు. నీతి, ధర్మం మాత్రమే పాటిస్తారు. ఇది మీ కాంగ్రెస్ నేతలకు, ముఖ్యంగా మీ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడికి తెలియదు, అర్థం కాదు. ఆయనకు కులం, డబ్బు ముఖ్యం. కాబట్టి ఈ సంస్కారమేమిటో ఇంకెవరినైనా అడిగి తెలుసుకోండి. మీకు తేలికగా అర్థమవుతుంది, మీ కుటుంబంలో ఆ సంస్కారం ఉంది గనుక.

అయితే చివరలో రాహుల్‌గాంధీ ఒక్క నిజం మాట్లాడారు. ఆయన చెప్పిన కారణమేదైనా కార్యం మాత్రం నిజం. కేసీఆర్ మీద ఐటీ, సీబీఐ, ఈడీకి సంబంధించిన ఒక్క కేసూ లేదు. ఆయన ఆదాయం వ్యవసాయం నుంచి వచ్చింది. అవి నీతి, అక్రమాలు లేకపోతే సీబీఐ దగ్గరికి రాదు. మరి రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిలాగా మనీ లాండరింగ్‌లో శిక్షణ తీసుకోలేదు. కనుక ఈడీ రాదు. ఎంత ద్వేషమున్నా మోదీ ఏం చేస్తాడాయనని? మిగతా రాష్ట్రాలలో మీ గెలుపు అక్కడ బీఆర్ఎస్ లాంటిది లేదు గనుక సాధ్యపడింది. బీహార్ ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, కేరళలో సింగిల్ పార్టీగా గెలవండి, చూద్దాం!

ఇక ఇక్కడ మీ గాలివాటు పథకాలు మాకొద్దు. అంతకంటే మంచివి ఆరు కాదు, అరవై ఉన్నాయి ఇక్కడ. అందుకని, ఎక్కువ శ్రమపడి ప్రసంగాలు చేసేటప్పుడు, మీ రాష్ట్ర నాయకులను నమ్ముకొని అభాసుపాలవకండి. ఉత్తర భారతదేశంలో, ప్రాంతీయ పార్టీలు లేనిచోట మీ విశ్వరూపం చూపండి.

ఇంకొక చిన్న సలహా- మీ చెల్లికి కూడా చెప్పండి. మీరిద్దరూ వారసత్వ రాజకీయాల గురించి మాట్లాడితే బాగుండదు. ముప్పై ఏండ్ల యినా మీరు ప్రధానమంత్రి కాలేదంటే కారణం, వారసత్వంతో రాజకీయ ప్రవేశం సులువవుతుంది. కానీ, రాజకీయ నిచ్చెన ఎక్కాలంటే ఇంకా చాలా లక్షణాలుండాలి. మా కేటీఆర్, హరీశ్‌రావులను గమనించండి.

భారతదేశంలో ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు తమ మతాచారాల ప్రకారం పండుగలు జరుపుకోవడం ఒక ఆనవాయితీ. ప్రత్యేకంగా దసరా నవరాత్రుల్లో ఆడపడచులు పూల పండుగ బతుకమ్మ గొప్పగా జరుపుకొంటారు. తెలంగాణ రాష్ట్రంలో విభిన్న రాష్ట్రాల నుంచి వలస వచ్చిన బీహారీలు ఛట్‌పూజ, బెంగాళీలు దుర్గా పూజ, మలయాళీలు ఓనమ్, మరాఠీలు గుడ్‌పావ్, గణేష్ చవితి, ఒడిశా వారు జగన్నాథ్ రథయాత్ర జరుపుకొంటారు.

తెలంగాణ తమిళుల దసరా

ఆళవందార్ వేణుమాధవ్
86860 51752

దాదాపు 400 ఏండ్ల కిందట శ్రీభగవద్రామానుజులు స్థాపించిన శ్రీ వైష్ణవ మత వ్యాప్తి కోసం తమిళనాడులోని శ్రీవైష్ణవుల దివ్య క్షేత్రాలు శ్రీరంగం, కాంచీపురం నుంచి ఆళ్వారుల సంతతికి చెందిన వైష్ణవ గురువులు కొంతమంది తెలంగాణ రాష్ట్రానికి వలస వచ్చి స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. వారు ప్రజలకు వైష్ణవత్వం బోధిస్తూ వారిని శిష్యులుగా చేసుకొని మంత్రోపదేశం చేయడంతో ఆ శిష్యులు గురుదక్షిణ కింద వైష్ణవ గురువులకు కొంత భూమి దానం చేశారు. గురువులు ఆ భూమి ద్వారా వచ్చిన ఆదాయంతో జీవనం కొనసాగిస్తూ వచ్చారు. ఈ వైష్ణవ గురువులలో శ్రీ కూరత్తాళ్వార్ సంబధీకులు శ్రీ వేద వ్యాస భట్టర్, శ్రీ పరాశర భట్టర్ ఆళవందార్, మతత మ్మాళ్, తిరునంతల్వార్, అమ్మింగి అమ్మాళ్, కిడాంబి వంశస్తులున్నారు. వీరు శరన్నవరాత్రులను విభిన్నరీతిలో జరుపుకొంటారు. ప్రస్తుతం ఈ కుటుంబాలు హైదరాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో నివసిస్తున్నాయి.

ఆశ్వయుజ పాడ్యమి నాడు వారి ఇండ్లల్లో చెక్క బొమ్మల కొలువు ఏర్పాటుచేసుకొని ఉదయం, సాయంత్రం ఆ బొమ్మల కొలువుకు హారతిస్తూ, దేవతా మూర్తులకు పిండి వంటలలో మొదటిరోజు బొబ్బట్లు, రెండవ రోజు చక్కెర పొంగలి, మూడవ రోజు పులిహోర, దధ్ధోజనం, నాల్గవ రోజు పాయసం బజ్జీలు, ఐదవ రోజు మూల నక్షత్రం సరస్వతి పూజ రోజు కుడుములు, ఆరవ రోజు లడ్డులు, ఏడవ రోజు పప్పుగారెలు, పాయసం, మహర్నవమి రోజు మహాలక్ష్మి పూజ నిర్వహించి బొబ్బట్లు, విజయదశమి రోజు ఇష్టమైన తీపి వంటలు నైవేద్యంగా పెడుతారు. ప్రతి రోజు ముత్తయిదువులను పేరంటాలకు పిలిచి తాంబూలం ఇచ్చి వైభవంగా జరుపుకొంటున్నారు.

విజయదశమిరోజు తర్వాత శ్రావణ నక్షత్రం రోజు బంధువులను, స్నేహితులను పిలిచి వాయనాలు ఇచ్చి చెక్క దేవత బొమ్మల కొలువులకు ఉద్వాసన పలికి తరతరాలుగా వస్తున్న వారి ఆచారాలు, సంప్రదాయాలను మరిచిపోకుండా జరుపుకోవడం వీరి ప్రత్యేకత.

ఈ చెక్క దేవత బొమ్మలను నూతనంగా పెండ్లి అయ్యి అత్తారింటికి వెళ్లేటప్పుడు నూతన వధువు ఒడిలో ఉంచి ఆనవాయితీ కొనసాగించమని వధువు తల్లిదండ్రులు చెప్తారు. నేటి తరానికి భక్తిని అందిస్తూ పండుగలు జరుపుకోవడం శ్రీ వైష్ణవుల కుటుంబాల ప్రత్యేకత. ఇలాంటి విభిన్నరీతిలో తమిళులు వారి సంప్రదాయం ఇంకను కొనసాగించడంలో తెలంగాణ ప్రజల ఆదరణ, ఆప్యాయతలే కారణం.

తలెత్తుకునేలా ఇల్లు..

'బతుకమ్మ పండుగ వత్తే బిడ్డ ముందుగాలొస్తది, దసరాకు అల్లుడు దిగుతడు. పెద్దపండుక్కు బిడ్డా, అల్లుడు వస్తాండ్రని సంబురపడాల్నా, అల్లుడొచ్చినంక ఎట్ల సర్దుకునుడని ఆగం కావాల్నో తెలియని పరిస్థితి. ఉన్న దొక్క అర్ర, ఎనుక చిన్న శాయవానా. వండిన గంజులన్నీ ఇంట్లకు దెచ్చి గిన్నెల్ల అన్నం పెట్టుకొని మంచంలొగలు, పీటేసుకొని ఒగలు తినేలా అలవాటుపడ్డ జీవితం. అల్లుడొచ్చినంక గూడా ఇట్లనే ఒక్కటే అర్రల ఎదురెదురుగా కూసోని తినుడు సానా కట్టం.

పోనీ బిడ్డను, అల్లున్ని ఇంట్లుంచి మనం బైటికెళ్లి తిందామా అంటే అంతా మురుగునీరు కంపు, రోడ్డు మీద వచ్చేటోళ్లు, పోయేటోళ్లు చూసేటట్టు అంతా పరాగతే. ఏం చెయ్యాల్నో ఏందో ఎటూ పొద్దు పోతలేదు, ఏం తోస్తలేదు. దేవుడా నువ్వే దిక్కు. అల్లునికి మర్యాదలు తక్కువ గాకుండా, ఇంటికొచ్చినోడు అల్గిపోకుండా ఉండేట్టు సూడు స్వామీ..' ఇది తెలంగాణ పల్లెల్లో డబుల్‌బెడ్రూం ఇల్లు ఇవ్వక ముందు సామాన్యుడి బతుకు చిత్రం.

రాజేంద్రప్రసాద్ చేలిక
99858 35601

ఇల్లు కట్టడానికి చేసిన అప్పు, పెళ్లి కోసం చేసిన రుణభారం ఎప్పటికీ తీరదు. వాటితో వచ్చే అనుభవం మరెప్పటికీ కలుగదని గమనించిన పెద్దలు అప్పుడెప్పుడో 'ఇల్లు కట్టి చూడు, పెళ్లి చేసి చూడు' అని ముందుతరాలకు చెప్పారు. ఇల్లు కట్టడమంటే ఎంత కష్టమైన పనో వారి మాటల వెనుక నిగూఢార్థం. ఇల్లుపై పెట్టిన పెట్టుబడి తీరదు. తెచ్చిన అప్పులకు మిత్తీలు పెరుగక ఆగవు. పండిన పంటంతా అప్పులకు, వడ్డీలు కట్టుడుకే సరిపోతుంది. ఇన్ని కష్టాల్లో సొంతిల్లు కట్టుకోవాలని ఆలోచన చేయడం, దాన్ని కార్యాచరణ దిశగా ముందుకు తీసుకెళ్లడం నిజంగా ఓ సవాల్. అంతకు మించి సాహసమే.

రాష్ట్ర ఆవిర్భావానికి ముందున్న కాంగ్రెస్, టీడీపీలు ఇళ్లను రాజకీయ అవసరాలకు వాడుకున్నాయి తప్ప పేదోడి అక్కర తీర్చేందుకు ఏ మాత్రం ప్రయత్నించలేదు. ఇందిరమ్మ ఇల్లు పేరుతో అప్పటి సర్కార్ కట్టిచ్చిన కొంప ఉండటానికి పనికిరాకుండా, వాడటానికి వీలు కాదన్నట్టుగా.. 'ఉన్నదా బసవా అంటే ఉన్నది..' అన్నట్టుగా ఉండేది. అదీ కాకుండా ఆ ఊర్లోకి వెళ్తుంటే ఎదురుగా దిష్టిగుమ్మాలుగా దర్శనమిచ్చేవి. డిక్కి రూమ్‌లు, గట్టిగా తంతే కూలే గోడలతో దూరం నుంచి చూడటానికే కొంప అనిపించేది తప్ప, దగ్గరికెళ్లి చూస్తే 'ఎల్లిపోయిన కొంప'గా తోచేది. అది ఇల్లా, లేదంటే స్నానం చేసేందుకు కట్టుకున్న చిన్నరూమా అన్నట్టు తోచేవి.

'ఇల్లు కట్టిస్తే ఇంటిల్లిపాది సంబురపడాలి. తరతరాలకు ఒక వరంగా ఉండాలి'. అనేది ప్రత్యేక రాష్ట్రం లో బీఆర్ఎస్ సర్కార్ చేసిన ఆలోచన. పండుగొచ్చి నా.. పబ్బమొచ్చినా, ఆపదొచ్చినా.. సంపదొచ్చినా ఇంటోళ్లంతా కలిసి ఒక్కచోట కలుసుకొని, మంచి, చెడులు ముచ్చటించుకుంటూ గడిపేలా ఇల్లు ఉండాలని పార్టీ అధినేత కేసీఆర్ భావించారు. ఉమ్మడి ఏపీలో అప్పటి ప్రభుత్వాలు ఇళ్ల పేరిట చేసిన కుట్రలు, అగ్గిపెట్టెల మాదిరి నిర్మాణాలతో జరిగిన తప్పిదాలను తిరిగి చేయొద్దనే సంకల్పంతో ఇంజినీర్లతో చర్చించారు. తెలంగాణ సర్కార్ కట్టించి ఇయ్యబోయే ఆ ఇల్లు, అప్పటికే దగాపడిన తెలంగాణ ప్రజలకు మరోమారు మోసం చేసేదిగా ఉండొద్దనే ఆలోచన చేశారు. కుటుంబమంతా కులాసాగా గడపాలనే సుదీర్ఘ చూపుతో ప్రణాళిక రచన చేశారు. మరీ ముఖ్యంగా పిల్లలు ఎదుగుతున్నప్పుడు ఇల్లు చిన్నదైతే కలిగే ఇబ్బందులు, ఆ టైంలో తల్లిదండ్రులు పిల్లల కష్టాలను చూడలేక పడే మానసిక సంఘర్షణను అధిగమించేలా ఇంటి నిర్మాణం జరగాలని గట్టిగా నిర్ణయించుకున్నారు.

కలల సౌధం డబుల్ బెడ్రూమ్. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పేదోడికి సొంతిల్లు ఉండాలనే కేసీఆర్ సంకల్పం నుంచి వచ్చిందే రెండు పడక గదుల ఇల్లు. పొద్దుపోయే వరకు టీవీ చూసుకుంటూ కూర్చుంటే పొద్దంతా కట్టం చేసొచ్చిన అవ్వయ్యకు ఇబ్బంది కాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఎండలబడొచ్చిన తల్లిదండ్రులు రాత్రిపూట బుక్కెడు బువ్వ తిన్న తర్వాత యాష్టకొచ్చి నిద్రించడానికి ప్రత్యేకంగా ఓ గది ఉండేలా, టీవీ చూసి, చదువైన తర్వాత పిల్లలు కూడా ప్రశాంతంగా నిద్రించేలా మరో గది ఉండేలా రాష్ట్ర సర్కార్ పక్కా ప్రణాళికతో ఇంటి నిర్మాణం చేయించింది. హైదరాబాద్ రాష్ట్రం నుంచి ఏపీలో కలిసిన తెలంగాణ పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టుగా మారిన తీరు, ప్రత్యేక రాష్ట్రంలో మరోమారు కావొద్దని ప్రతి పేద కుటుంబానికి డబుల్ బెడ్రూం ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు బీఆర్ఎస్ సర్కార్ గట్టి నిర్ణయం తీసుకుంది. గ్రామాల వారీగా అర్హుల జాబితాలు తీసుకొని, స్థానిక ప్రజాప్రతినిధులతో విస్తృతంగా చర్చలు జరిపి రెండు పర్యాయాలు బీఆర్ఎస్ సర్కార్ తన కర్తవ్యాన్ని ఎక్కడా విస్మరించకుండా డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించి పకడ్బందీగా కేటాయించింది.

ఇల్లున్నదంటే గర్వం. ఇల్లంటేనే సర్వస్వం. పదేండ్ల కిందటి వరకు తల దించుకొని ఇంట్లోకి వెళ్లాల్సిన దుస్థితికి తెలంగాణ సర్కార్ చరమగీతం పాడింది. హుందాగా, నిటారుగా తలెత్తుకుని ఇంట్లోకి వెళ్లేలా, ఇంటినే చూస్తూ, ఇది కదా నేను కలలుగన్నది అనేలా ప్రజలంతా ఖుషీ అయ్యేలా ఇంటిని నిర్మించి ఇచ్చింది. ఇంటికెవరైనా వస్తే ఎలా తప్పించుకుందామా.. అనే దుస్థితి నుంచి, దారిని పోయే వేలు విడిచిన చుట్టాలను కూడా సగర్వంగా ఇంటికి పిలుచుకొని మర్యాదలు చేసేలా సౌకర్యాలు కల్పిస్తూ కట్టించిన ఇళ్లను బహుమతిగా పంపిణీ చేసింది. రెండు పర్యాయాలు అప్రతిహతంగా సాగిన డబుల్ బెడ్రూం ఇండ్ల కేటాయింపు ఇప్పుడు మరో మారు రికార్డు దిశగా దూసుకెళ్లేలా సీఎం కేసీఆర్ ప్రకటించారు.

ఈ విడత తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని ఘంటాపథంగా ప్రకటించి తానేంటో మరోమారు సమస్తానికి తెలియజెప్పారు. పోటీల కోసం వేలం వెర్రిగా ప్రకటనలు గుప్పించడం కాదు, ప్రజల కష్టాలు తెలుసుకుని తీర్చడానికి శాయశక్తులా కృషిచేసే దిశగా ప్రయత్నాలు చేయాలని చెప్పకనే చెప్పారు. గృహమే కదా స్వర్గసీమ అన్నట్టుగా నూరేండ్లు మనగాల్సిన కట్టడాన్ని నవ్వుల పాలు చేసేందుకు ఉబలాటపడుతున్న కొన్ని స్వార్థశక్తుల 'హస్తాల్లో' ఇళ్లు బందీ కావొద్దని తన మనస్సులో మాటను అందరిముందు ప్రకటించారు. ఇల్లు కట్టిండు అంటే 'వాడికేంట్రా ఉన్నోడు' అని భావించే పోకడలను తుదముట్టించి 'ఇల్లుదేమున్నదిరా.. బీఆర్ఎస్ పాలనలో ఇప్పుడది అందరికీ సుసాధ్యమే కదా..' అని ప్రతి నిరుపేద ధైర్యంగా కలలుగనే రోజును కళ్లముందుంచింది. పేదోడి కష్టాన్ని బాపేందుకు తపిస్తున్న ప్రస్తుత తీరును అర్థం చేసుకుందామా.., భ్రమల్లో విహరింపజేస్తున్న తీరును నమ్మి మునుగుదామా.. ఇక నిర్ణయం మనదే.

ఎటమటం

ఇంటికి పంపేదాకా వదలరా?

ఇంతకు రాములమ్మ నా శ్రేయోభిలాషో, వ్యతిరేకో అర్థం కావడం లేదని బండి సంజయ్ వాపోతున్నారట. గజ్వేల్ నుంచి పోటీకి సిద్ధమని ఈటల రాజేందర్ అంటుంటే, కాదు.. కాదు అక్కడినుంచి బండి సంజయ్, కామారెడ్డి నుంచి తాను పోటీ చేస్తే బాగుంటుందని విజయశాంతి కొత్త ఫిట్టింగ్ పెట్టడంలో మతలబు ఏమిటో అర్థం కావడం లేదని బండి తన సన్నిహితుల వద్ద వాపోతున్నారు. సీఎం కేసీఆర్‌ను ఎదుర్కొనే సత్తా తనకు లేదని పార్టీ బాధ్యతలు కిషన్‌రెడ్డికి అప్పగించారు. అలాంటప్పుడు గజ్వేల్‌లో కిషన్‌రెడ్డిని బరిలోకి దించితే బాగుంటుంది కానీ, నన్నెందుకు పోటీ చేయమంటున్నారని బండి ప్రశ్నిస్తున్నారట. రాష్ట్ర అధ్యక్షునిగా తప్పించి అవమానించింది సరిపోలేదా? గజ్వేల్‌లో కూడా ఓడించి ఇంటికి పంపిస్తే కానీ, కడుపు సల్లబడేట్టు లేదు పార్టీలో కొందరికి అని బండి సంజయ్ కారాలు, మిరియాలు నూరుతున్నారట. ఇంతకు ఆ కొందరు ఎవరన్నట్టు?.



పవన్‌ను అడిగితే పోయేది

ఇజ్రాయెల్, పాలస్తీనా పంచాయితీ అయినా తెగేటట్టు ఉంది కానీ, రాష్ట్రంలో కమ్యూనిస్టులకు మాత్రం పొత్తు కుదిరేటట్టు లేదని పొలిటికల్ సర్కిల్‌లో జోకు లేసుకుంటున్నారు. తమతో పొత్తు వల్ల అధికారం చేరువవుతుందని కమ్యూనిస్టు పార్టీలు ఎంత ఊరించి చెప్పినా కాంగ్రెస్ నేతల తలకు ఎక్కడం లేదట. తమకు ఇచ్చే సీట్లను ఏదో దయదలచి ఇచ్చే కారుణ్య సీట్లలాగా వారు ఫీలవుతున్నారని కామ్రేడ్లు గుర్రుగా ఉన్నారు. టీపీసీసీని అడిగితే, పొత్తుల వ్యవహారం తమ పరిధిలో లేదంటారు. ఢిల్లీకి వెళ్తేనేమో లోకల్ లీడర్స్‌తో మాట్లాడుకోమంటున్నారని మండిపడుతున్నారు. అదే జనసేన పవన్‌కల్యాణ్ చూడండి.. టీడీపీ వాళ్లు 25 సీట్లడిగితే 50 తీసుకోండి ఇబ్బందేమీ లేదంటున్నారట. సీట్ల కోసం వాళ్లను వీళ్లను అడిగే కంటే ఏ షర్మిలమ్మనో, జనసేననో, ప్రజాశాంతి పార్టీనో అడిగి ఉంటే ఎన్ని అడిగితే అన్ని ఇచ్చే వారని దీర్ఘాలు తీస్తున్నారట.

గుడి పక్కకు వెళ్లొద్దురో..

గన్‌పార్క్ వద్ద ప్రమాణం చేద్దాం రండి అని రేవంత్‌రెడ్డి సవాల్ విసరడం వెనుక మతలబు వేరే ఉందట. గతంలో ఈటల రాజేందర్‌కు సవాల్ విసిరినప్పుడు భాగ్యలక్ష్మి టెంపుల్‌కు వెళ్లిన రేవంత్‌రెడ్డి, తాజాగా గన్‌పార్క్‌ను ఎంచుకోవడంలో అంతర్యం